
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024 | 5



ఉమ్మడి మేనిఫెస్టో - 2024



ప్రజాగళం సూపర్‌హిట్!

- టీడీపీ కూటమి 'ప్రజాగళం' మేనిఫెస్టోకు అనూహ్య స్పందన
- రైతులు, మహిళలు, యువత, పేదలు అన్ని వర్గాలకు చోటు కల్పిస్తూ కీలక హామీలు
- ప్రతి మహిళకు నెలకు రూ.1500తో ఉమ్మడి తూర్పులో 32 లక్షల మందికి లబ్ధి
- ఏటా రైతులకు రూ.20 వేల సాయం హామీతో ఉమ్మడి జిల్లాలో వేలాదిమందికి ప్రయోజనం
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలతో 21లక్షల మందికి లబ్ధి
- ఏటా మూడు గ్యాస్ సిలిండర్లతో 17.19 లక్షల కుటుంబాల్లో ఆనందం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో 35 లక్షల మందికిపైగా మేలు
- పింఛన్లు రూ.4 వేలకు పెంపుతో ఉమ్మడి జిల్లాలో 7.68 లక్షల మందికి ధీమా
- రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో 17.19 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షలకు పెంపుతో ఉమ్మడి జిల్లాలో 27,659 గ్రూపుల్లో ఆనందం



టీడీపీ కూటమి మేనిఫెస్టో అదిరింది. అన్ని వర్గాలకు అండదండగా నిలుస్తూ నిలువెత్తు భరోసా నింపింది. ఇసుక దొరక్క ఇళ్లు కట్టకోలేని పేదలకు ఉచిత ఇసుక విధానంతో ఊరటనిచ్చింది. పేదలకు ఊపిరిగా ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా ధీమానిచ్చింది. అతివలకు పెద్దపీట వేస్తూ ఎన్నో వరాలిచ్చింది. బడికి పంపే తల్లులకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లతో వారికి అండగా నిలిచింది. ఏటా రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం ప్రకటనతో అన్నదాతల మోముపై చిరునవ్వులు చిందించేలా చేసింది. వివిధ సామాజికవర్గాలకు కార్పొరేషన్లు, సబ్‌ప్లాన్‌ల ప్రకటనతో మంచిరోజులు వచ్చేలా ఆశలు కల్పించింది. ఇలా మంగళవారం విడుదలైన టీడీపీ కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల్లో ధైర్యం, ధీమా కల్పించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి/ కాకినాడ

ప్రజలకు ఆరోగ్య ధీమా.. రైతులకు సాయం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే పేదలకు ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని మంగళవారం విడుదల చేసిన కూటమి మేనిఫెస్టో ప్రకటించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేద వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 17.19 లక్షల కుటుంబాలున్నాయి. తాజా అంచనాల ప్రకారం ఈ కుటుంబాల సంఖ్య 25 లక్షలకుపైగానే ఉంటుంది. అయితే వీటిలో అనేక కుటుంబాలు కాయకష్టం చేసుకుని బతికే పేద కుటుంబాలే. ఇంట్లో పెద్దదిక్కుకు, లేదా కుటుంబ సభ్యులకు అనారోగ్యం సమస్య వస్తే లక్షల్లో ఖర్చులు భరించలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేయనున్న ఆరోగ్యబీమాతో లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. అలాగే రైతులకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయంపై అన్నదాతల్లో ఆనందం వ్యక్తమయ్యేలా చేస్తోంది. జిల్లాలో ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంట చేతికి వచ్చే దశలో నష్టపోయి అన్నదాతలు రోడ్డునపడుతున్నారు. పెట్టిన పెట్టుబడి నీళ్లపాలై అప్పులపాలవుతున్నారు. కూటమి రాగానే రూ.20 వేల సాయం రైతులకు భరోసా కల్పించనుంది. వాస్తవానికి జగన్ ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రూ.7,500 మాత్రమే ఇస్తోంది. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ప్రకటించడంతో భారీ మేలు జరగనుంది.

తల్లులకు అండాదండా...

మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపుగా 32 లక్షల మందికిపైగా ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. అలాగే ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని హామీ ఇవ్వడంతో అనేక పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా కొండంత బరువు దిగనుంది. ఉమ్మడి జిల్లాలో 17.19 లక్షలకుపైగా కుటుంబాలున్నాయి. తద్వారా ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2,500 వరకు ఆర్థికంగా డబ్బులు ఆదా అవనున్నాయి. అలాగే స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల వరకు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రస్తావించారు. తద్వారా లక్షల మంది తల్లులకు మేలు జరగనుంది. వాస్తవానికి అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో 21 లక్షల మందికిపైగా విద్యార్థులు వివిధ ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. కానీ వీరిలో భారీగా కోతవేసి జగన్ సర్కారు అందిస్తోంది. కానీ కూటమి మాత్రం షరతులు లేకుండా ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఆ కుటుంబంలో ఇస్తామని హామీ ఇచ్చింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీ ఇవ్వడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జగన్ ప్రభుత్వంలో ఆర్టీసీ ఛార్జీలతో జేబులు గుల్లవుతున్నాయి. కూటమి హామీతో ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మంది మహిళలకు మేలు కలగనుంది.

కల నెరవేరినట్లే...

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను పూర్తి జగన్ సర్కారు పాలనలో కలగా మారింది. కానీ కూటమి ఈ లైను పూర్తిచేస్తామని ఏకంగా మేనిఫెస్టోలో ప్రకటించడం విశేషం. వాస్తవానికి రాష్ట్రం మొత్తానికి సంబంధించిన అంశాలను పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటిస్తాయి. కానీ ఒక ప్రాంతానికి సంబంధించి చిరకాల వాంఛను నెరవేర్చుతామని ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జగన్ ప్రభుత్వం అయిదేళ్లలో ఈ ప్రాజెక్టు కనీసం ముందుకు కదల్లేదు. నిజానికి 2014లో టీడీపీ వచ్చాకే పనుల్లో వేగం పెరిగింది. కానీ వైసీపీ వచ్చాక రాష్ట్రవాటాగా 25 శాతం నిధులు జగన్ సర్కారు ఇవ్వలేదు. గత బడ్జెట్‌లో కేంద్రం రూ.100 కోట్లు ప్రకటించింది.

అన్ని వర్గాలకు అండగా...

యువతకు 20 లక్షల ఉద్యోగాలతోపాటు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి మేలు కలగనుంది. అయిదేళ్లుగా డీఎస్సీతోపాటు ఇతర పోటీపరీక్షలకు పెద్దగా నోటిఫికేషన్ లేని నేపథ్యంలో కూటమి మేనిఫెస్టో వీరికి భవిష్యత్తుపై ధీమా పెంచింది. అలాగే పూర్ టు రిచ్ కింద పేదలను సంపన్నులు చేసే పీ4 పథకం ప్రకటించడంతో జిల్లాలో పేద కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. సౌభాగ్యపథకం కింద చిన్నతరహా, మధ్య, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంతో గరిష్ఠంగా 10 లక్షల వరకు సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. దీంతో కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారికి తోడ్పాటు లభించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 7.68 లక్షల మందికి నెలనెలా పింఛను అందుతోంది. ప్రస్తుతం వీరికి నెలకు జగన్ సర్కారు రూ.3వేలు చొప్పున అందిస్తోంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకు పెంచుతామని ప్రకటించింది. దీంతో 7.68 లక్షల మందికి ఆర్థిక లబ్ధి భారీగా జరగనుంది. జిల్లాలో బీసీలు లక్షల్లో ఉన్నారు. వారికి సబ్‌ప్లాన్ ద్వారా లక్షన్నర కోట్లు ఖర్చుచేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో బీసీలకు ఆదరణ పథకం కింద పనిముట్లు, ఇతర ఆర్థిక లబ్ధి భారీగా జరగనుంది. దేవాలయల్లో పనిచేస్తే నాయిబ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల జీతం ప్రకటించడంతో వారిలో మేనిఫెస్టోపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యేలా చేస్తున్నాయి. ఇక గీత కార్మికులకు మద్యం షాపుల్లో పది శాతం కేటాయిస్తామనడంతో ఉమ్మడి జిల్లాలో అనేకమంది గీత కార్మికులకు మేలు జరగనుంది. వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20వేల సాయం, బోట్ల మరమ్మతులకు సాయం ప్రకటిస్తామనడంతో 85వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి జరగనుంది. పైగా మత్స్యకారులు మొదటినుంచీ టీడీపీకి వెన్నుముకగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతామని ప్రకటించా రు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 27,659 డ్వాక్రా గ్రూపులకు ఆర్థికంగా మరింత పటిష్టత లభించే అవకాశం ఏర్పడింది. అలాగే కూటమి రాగానే సీపీఎస్ సమస్యకు పరిష్కారంతోపాటు మెరుగైన పీఆర్సీ ఇస్తామని ప్రకటించడంతో ఉద్యోగ సంఘాలు మేనిఫెస్టోపై హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

భారం తగ్గినట్లే...

జగన్ సర్కారు అయిదేళ్ల పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలను పీడించేసింది. పన్నుల వాతలు, ఛార్జీలతో నడ్డివిరగ్గొట్టింది. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 17.19 లక్షల కుటుంబాలు ఊపిరిపీల్చుకున్నాయి. ఇంటిపన్ను విషయంలోను హామీ ఇవ్వడంతో ఆర్థిక బాధలు తప్పే అవకాశం ఏర్పడింది. పేదలకు గ్రామాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం ప్రకటనతో హర్షం వ్యక్తమైంది. కాపు సామాజికవర్గానికి రూ.15 వేల కోట్లతో సంక్షేమం చేపట్టనున్నట్టు ప్రకటించడంతో జిల్లాలో ఆ సామాజికవర్గం మేనిఫెస్టోకు జైకొట్టింది. ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల సాయంతో ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే వలంటీర్లకు వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని కూటమి ప్రకటించింది. దీంతో 28,300 మంది ఉమ్మడి జిల్లాలో ఉన్న వలంటీర్లకు ప్రయోజనం కలగనుంది.

మరెన్నో పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు..

హిందూ దేవాలయాలు, సత్రాలు, ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ ఏర్పాటు, ప్రైవేట్ ఆలయాల అర్చకులకు కనీసం వేతనం, అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టయిఫండ్, స్థానిక సంస్థల ప్రతినిధుల గౌరవం వేతనం పెంపు, నేరుగా పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు, ఆక్వాకు రూ.1.5కే యూనిట్ విద్యుత్, 117 జీవో రద్దుచేసి మూతపడిన పాఠశాలలను పునరుద్ధరిస్తారు. ఉచిత ఇసుక విధానం తెస్తారు. ఎయిడెడ్, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తారు. అన్నా క్యాంటీన్లు, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఏర్పాటుచేస్తారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేస్తారు. క్రిస్టియన్ మిషనరీల ఆస్తుల అభివృద్ధి బోర్డు, చర్చిల నిర్మాణం, జెరూసలెం యాత్రికుల సహాయం చేస్తారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్, రాయితీతో సోలార్ పంపుసెట్లు, డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తారు. తక్కువ జీతాలు వచ్చే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపు, పాడి రైతులకు పశువులు కొనుగోలు, దాణా, మందుల కొనుగోలుపై సబ్సిడీ, ఇన్సూరెన్స్ సౌకర్యం, గోకులాల ఏర్పాట్లు, గోపాలమిత్ర పునరుద్ధరణ, మేత కోసం బంజరు భూముల కేటాయింపు వంటి చర్యలు తీసుకుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోర్టుతీర్పు ప్రకారం గ్రాడ్యుటీ, ఆశావర్కల జీతాల పెంపు, మహిళా ఉద్యోగులకు హాస్టల్ వసతి వంటి పథకాలను అమలుచేస్తారు. - ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం

వైసీపీ మేనిఫెస్టో ఏముంది.. ఏమీ లేదు.. కూటమి మేనిఫెస్టో మాత్రం జనరంజకంగా ఉంది.. అన్నివర్గాలను ఆకట్టుకునే మేనిఫెస్టో ఇది.. ఇదీ జనం మాట.. ఎవరేమన్నారో ఒకసారి చూసేద్దాం..

రేపటి ఆకాంక్షల సాకారం దిశగా మేనిఫెస్టో



పిఠాపురం: రాష్ట్ర భవిష్యత్తుపై కత్తి వేలాడుతోంది. టీడీపీకి యువగళంలో, జనసేనకు జనవాణిలో ప్రజలనుంచి వచ్చిన వినతులు, సూచనలు క్రోడీకరించి మేనిఫెస్టో తయారుచేశాం. రాష్ట్ర ప్రజల అవసరాలు తీరుస్తూ రేపటి ఆకాంక్షలు సాకారం దిశగా మేనిఫెస్టోను కూటమి ప్రభుత్వం ఉమ్మడిగా అమలు చేస్తుంది.

-పవన్‌కల్యాణ్, పిఠాపురం కూటమి అభ్యర్థి

ఎన్డీఏ సహకారంతో కూటమి మేనిఫెస్టో అద్భుతం



సామర్లకోట: అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయంకోసం సూపర్ సిక్స్ పేరిట ఆరు హామీలు, జనసేన ప్రతిపాదించిన షణ్ముఖ వ్యూహం అంశాలను పొందుపరిచి కూటమి రూపొందించిన మేనిఫెస్టో ఎన్డీఏ ప్రభుత్వసహకారంతో నూరుశాతం రాష్ట్రంలో అమలు చేస్తాం. సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబుతోనే సాధ్యం.

-చినరాజప్ప, పెద్దాపురం కూటమి అభ్యర్థి

అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న మేనిఫెస్టో



జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఉమ్మడి మేనిఫెస్టోను తయారు చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ పూర్తిస్థాయిలో న్యాయం అందుతుంది. నవరత్నాల పేరిట మోసం చేసిన జగన్‌కు ఈ మేనిఫెస్టో ఒక నిదర్శనం. దీనిద్వారా అన్నివర్గాల ప్రజలు కూటమి విజయానికి కృషి చేస్తారు.

-జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట కూటమి అభ్యర్థి

ఉమ్మడి మేనిఫెస్టో.. ఒక విజన్ డాక్యుమెంట్



కాకినాడ సిటీ: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయింది. జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో ఒక విజన్ డాక్యుమెంట్ లాంటిది. సంక్షేమంతోపాటు అభివృద్ధి ఉంది. రాబోయే తరాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని ఒక విజన్‌తో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దీన్ని రూపొందించారు.

-తంగెళ్ల ఉదయ్, కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి

అన్ని వర్గాలను ఆదుకునే ప్రజా మేనిఫెస్టో..



కాకినాడ సిటీ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలను ఆదుకునే ప్రజామేనిఫెస్టో కానుంది. రాబోయే కూటమి ప్రభుత్వం హామీలన్నీ నెరవేర్చనుంది. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని సంక్షేమ ఫలాలు అందించనుంది. గత ఎన్నికల్లో వైసీపీ మేనిఫెస్టోలో మోసపూరిత హామీలు ఇచ్చి సరిగా ఒక్కటీ నెరవేర్చలేదు.

-వనమాడి కొండబాబు, కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి

జనరంజకంగా మేనిఫెస్టో



ప్రత్తిపాడు: టీడీపీ కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే హామీలు మేనిఫెస్టోలో ఉన్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనకు మెగా డీఎస్సీపై తొలి సంతకం, 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పన, యువతకు ఎంతో ప్రయోజనకంగా ఉంది.

-వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీటతో బ్రహ్మాండంగా ఉంది



సర్పవరం జంక్షన్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టో బ్రహ్మాండంగా ఉంది. సంక్షేమం, అభివృద్ధికి ఆదాయం, సంపద ఎలా సృష్టించనున్నారు, వెచ్చించనున్నారో ఆర్థిక విశ్లేషణ చేసిన తర్వాతే మేనిఫెస్టోను చంద్రబాబు, పవన్ విడుదల చేశారు.

-పంతం నానాజీ, కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి

కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు



తుని రూరల్: కూటమి పార్టీలు విడుదల చేసిన మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది. వైసీపీ పాలనలో దగా పడ్డ డీఎస్సీ అభ్యర్థులకు విడుదల మేనిఫెస్టోతో ఆశలు చిగురించాయి. మహిళలు, వృద్ధులకు రాష్ట్రంలో నిజమైన సంక్షేమం మొదలవుతుంది. బీసీ రక్షణ చట్టాన్ని పొందుపరచడం శుభపరిణామం.

-యనమల దివ్య, తుని కూటమి అభ్యర్థి



ఉపయోగకరంగా ఉంది



గండేపల్లి: కూటమి మేనిఫెస్టో రైతులు, మధ్య తరగతి, నిరుద్యోగులకు ఆశాజనకంగా ఉంది. రైతులకు ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి ఇస్తాననడం సంతోషకరం. వైసీపీ మేనిఫెస్టో అంతా పాంప్లెట్‌లాగా ఉంది. ఎవరికీ పెద్దగా ఉపయోగంలేదు.

-మాసిన సత్యనారాయణ, రైతు, కె.నాయకంపల్లి, గండేపల్లి

కొత్త వెలుగులు నింపుతుంది



పిఠాపురం రూరల్: కూటమి ప్రకటించిన మేనిఫెస్టో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుంది. 18నుంచి 59 సంవత్సరాల మహిళలకు ప్రతి నెలా రూ.1500 అందించడం వారికి భరోసాను ఇస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు ఎక్కడికైనా వెళ్లొచ్చు.

-గరగ వీరలక్ష్మి, గోకివాడ, పిఠాపురం మండలం

మేలు చేకూర్చే అంశాలు భేష్



సామర్లకోట: వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌సరఫరా, దళారుల దోపిడీని అరికట్టేందుకు ఏపీ ఎంసీ యాక్ట్ పటిష్టంగా అమలు అంశాలు రైతులకు ఎంతగానో మేలు చేకూరుస్తాయి. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం సాగుకు ప్రోత్సాహకాలు నిర్ణయం మంచిది.

-బండారు వెంకట సత్యనారాయణ యువరైతు, సామర్లకోట

యువత ఉపాధికి భరోసా ఇస్తుంది



పిఠాపురం: యువత ఉపాధికి భరోసా ఇచ్చేలా మేనిఫెస్టో ఉంది. చదువుకున్న యువతకు నిరుద్యోగ భృతితో పాటు అసంఘటిత కార్మికుల సంక్షేమ పథకాల కొనసాగింపు, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు రూ.10లక్షల వరకూ సబ్సిడీతో రుణాలు ఇందుకు దోహదం చేస్తాయి.

-పి.దుర్గాప్రసాద్, పెయింటింగ్ మేస్త్రి, పిఠాపురం

ఫించన్లు పెంపు పేదలకు ఆనందం



కోటనందూరు: పింఛన్లు పెంపు పేదల జీవితాలకు వెలుగు అని చంద్రబాబు నిర్ణయం. టీడీపీ మ్యానిఫెస్టోలో పెన్షన్ పెంపు ఆనందంగా ఉంది. వైసీపీ ప్రభుత్వం కంటే చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకున్నారు.

-చింతకాయల రవికుమార్, కోటనందూరు

బీసీ రక్షణ చట్టంపై హర్షం



శంఖవరం: కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలో బీసీలకు రక్షణ చట్టం తేవడం చాలా సంతోషం. 50ఏళ్లకే బీసీలకు పింఛను ఇవ్వనుండడంతో బీసీకూలాల్లో పేదలకు మేలు జరుగుతుంది. వైసీపీ పాలనలో బీసీలపై దాడులు తప్ప ఒరిగింది ఏమీ లేదు.

-కిల్లాడి నర్సమ్మ, శంఖవరం

ఎప్పుడూ ప్రజలతోనే ఉన్నా..

జ్యోతుల నెహ్రూ,
జగ్గంపేట కూటమి టీడీపీ అభ్యర్థి

ఇంటర్వ్యూ



నేను ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నాను.. ప్రజలతోనే ఉన్నాను.. నాకున్నది ప్రజాబలమే.. ఎందుకంటే ప్రజల తరపున పోరాడే వ్యక్తిని నేను.. వారి వెంటే ఉంటాను.. వారితోనే నడుస్తాను.. అందుకే ప్రజలు నా వెంట ఉంటారు.. నాతో నడుస్తారు.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలంతో మరింత మెజార్టితో నేను విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. మా ప్రాంతంలో కూటమి మేనిఫెస్టో అమలుతోపాటు నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఐదు అంశాలపై దృష్టి సారించాం. విద్య, వైద్యం, అందరికీ ఇళ్లు, యువతకు ఉపాధి, రైతులకు తాగు, సాగునీరు వంటివి అందరికీ అందించాలన్నదే నా ధ్యేయం. ఇవన్నీ నెరవేర్చగలిగేది జ్యోతుల నెహ్రూ మాత్రమేననే నమ్మకం అక్కడి ప్రజల్లో ఉంది. అందువల్ల మా ప్రజలందరూ నేనే గెలవాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగ్గంపేటలో నేను తప్పకుండా గెలుస్తాను.. - వివరాలు 7లో

అమ్మఒడి ఒకరికే ఇస్తే.. మరో బిడ్డను జగన్ దత్తత తీసుకుంటాడా?

- నాసిరకం మద్యంతో కోట్లు దోపిడీ
- పీసీసీ చీఫ్, జగన్ సోదరి షర్మిల ధ్వజం

అంబాజీపేట, ఏప్రిల్ 30: రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాసిరకం మద్యం విక్రయించి జగన్ అండ్‌కో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీ న్యాయ యాత్ర రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు.వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి ఇస్తానన్న జగన్ మిగిలిన బిడ్డలను దత్తత తీసుకుంటాడా అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గానికి సీఎం జగన్ వచ్చినప్పుడు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ద్వారా అనేక హామీలు ఇచ్చారని ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. గోదావరి వరదల సమయంలో కాజ్‌వేలు ఏర్పాటు, రివిట్‌మెంట్ నిర్మాణం వంటి హామీలు నేటికి గాలిలోనే ఉన్నాయన్నారు.ప్రధాన రహదారులు గోతులమయంగా ఉన్నా కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేంద్రం, రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకూ రుణమాఫీ, పంటలకు పెట్టుబడికి రుణాలు, మద్దతు ధర కల్పిస్తామన్నారు. రాజన్న బిడ్డ మీ ముందుకు వచ్చిందని, గతంలో రాజశేఖరరెడ్డి ప్రజల కోసం ఎలా ఆలోచించి పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అందించారో అదే విధంగా అందిస్తానన్నారు. ప్రత్యేక హోదా సాధన, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసేలా కృషిచేస్తానన్నారు.అనంతరం ఎంపీ అభ్యర్థి జంగా గౌతమ్, అసెంబ్లీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, అయితాబత్తుల సుభాషిణి, ములపర్తి మోహనరావు, నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి, నేతల నాగరాజు,నాగవరపు నాగరాజు, పితాని ఆనందరావు, మహ్మద్ ఇస్మాయిల్, కొండేటి వెంకటేశ్వరరావు, ధర్మారావు పాల్గొన్నారు.



అంబాజీపేట జంక్షన్‌లో షర్మిల సభకు భారీగా హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
బుధవారం 1 మే 2024 6

అట్లుంటది జగన్‌తోని...



సిరా గుర్తు చెరిగిపోదు..

పెద్దాపురం, ఏప్రిల్ 30 : పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ముందు ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్కను గుర్తుగా పెడతారు. దీంతో ఓటరు మరోసారి ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఈ నిబంధన రూపొందించింది. ఓటరు వేలిపై సిరా గుర్తు 72 గంటలు పాటు చెరగకుండా ఉంటుంది. మైసూరుకు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ పరిశ్రమ తయారుచేసిన ఇంకును 1962 నుంచీ ఉపయోగిస్తున్నారు. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ కలపడం వల్ల తొందరగా చెరిగిపోదు.

వీళ్ల సీజన్ నడుస్తోంది!



సామర్లకోట, ఏప్రిల్ 30: ఎన్నికలు వచ్చాయంటే కొందరికి పండుగే. ఎన్నికలప్పుడు వీరు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా లేకుండా అన్ని చోట్లా వీరే కనిపిస్తుంటారు. ఎక్కడికి వెళ్లినా పాదరసంలా వారితో అంటుకుపోతారు. ఆ అభ్యర్థి విజయం కోసం పనిచేస్తున్నట్లు బిల్డప్ ఇస్తుంటారు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి హడావుడి చేసి సాయంత్రానికి మరో పార్టీ వద్ద అదే హడావుడి చేస్తారు. ఇలాంటివి రాజకీయాల్లో సహజమే కానీ గతంలో అలాంటి వారిని ఇట్టే కనిపెట్టేసే వారుంటారు. ఎందుకంటే వారి సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. ఈ సారి పెద్దాపురం నియోజకవర్గంలో వీరి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఓటర్లకు విందులు, బహుమతులు ప్రదానం చేసే సమయంలో వీరిదే సందడి. వివిధ సంఘాలలోనూ వీరే కనిపించడం మరీ విచిత్రం. ఇప్పుడే ఇలా ఉంది ఇంకా ప్రచారం ఊపందుకుంటే ఎన్ని వింతలు చూడాల్సి వస్తుందోనని పలువురు పేర్కొంటున్నారు.

పోలింగ్ ఆలస్యమైతే సమయం పెంచరు



పెద్దాపురం, ఏప్రిల్ 30: ఏ కారణంతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైన్లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంతరాత్రి అయినా సరే వారంతా ఓటు వేసేవరకూ పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రంలో కానీ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో కానీ అభ్యర్థి, మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తుకు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయకూడదు. గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి అభ్యర్థి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన వద్ద ఉన్న ఆయుధాన్ని పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తీసుకోవాలి. ఓటు వేసేటప్పుడు ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరించడం నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.



పంట పొలాల సాగు తర్వాత ఆ స్థాయిలో ఉపాధినిచ్చేది పాడి పరిశ్రమ. పాడి పశువుల పెంపకంపై ఆధారపడి వేలాది మంది జీవిస్తుంటారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన వాటిలో పాడి పరిశ్రమ కూడా ఒకటి.. ఈ ఐదేళ్ల కాలంలో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. పాడి పరిశ్రమ వృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అధికారంలోకి రాగానే వైసీపీ రద్దు చేసింది.

టీడీపీ హయాంలో పాల పోటీల నిర్వహణ (ఫైల్)

నిలిచిన మినీ గోకులం నిర్మాణం

వైసీపీ ఐదేళ్ల పాలనలో గొడ్డుకాలం

● (మండపేట)

- జగన్ ప్రభుత్వంలో పాడి పరిశ్రమపై తీవ్ర నిర్లక్ష్యం
- టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు
- దాణాపై సబ్సిడీ పూర్తిస్థాయిలో తగ్గింపు
- పాల పోటీలు, పశువుల అందాల పోటీల ఊసేలేదు
- ఆర్థిక ఇబ్బందుల్లో పాడి రైతులు

గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో రైతులకు సబ్సిడీపై సైలజ గడ్డిని అందజేసేవారు. అలాగే మేలు జాతి పశువులు పెంచే రైతులను ప్రోత్సహిస్తూ ప్రోత్సాహకాలు అందేవి. టీడీపీ ప్రభుత్వంలో పాడి రైతులకు పశువుల పాకలకు బదులుగా షెడ్లు నిర్మించుకునేందుకు మినీ గోకులం పేరిట సబ్సిడీతో కూడిన రుణాలు అందించేవారు. పాడి రైతులకు సైలజ గడ్డిని కిలో రూ.2కే అందించారు. పశు దాణా 75 శాతం మేర సబ్సిడీతో కిలో రూ.4 కే అందించారు. ఉపాధి హామీ పథకంలో గోకులాలు, మినీ గోకులాలు నిర్మించారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ మాయమయ్యాయి.



పాడి రైతులను పట్టించుకునే వారే కరువయ్యారు. దాణా, గడ్డిపై సబ్సిడీలు పూర్తిస్థాయిలో తగ్గించేశారు. గోకులాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు, బకాయిల చెల్లింపు జరగలేదు. దీంతో వారు అప్పులపాలయ్యారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకంలో పశుగ్రాసం పెంపకం జరిగేది. అది కూడా ఈ ఐదేళ్లలో నిలిచిపోయింది. గ్రామాల్లో పశువుల కోసం చేతి పంపుల వద్ద తొట్టెలు నిర్మించేవారు కానీ ఇప్పుడు అవేమీ లేకుండా పోయాయి.

ఆంధ్రా హరియాణాకు అన్యాయం

మండపేట, ఆలమూరు పరిసర ప్రాంతాలకు పశువుల పెంపకంలో ఆంధ్రా హరియాణాగా పేరుంది. అయితే ఇక్కడ పాడి పరిశ్రమ అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పశుగ్రాస ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ హయాంలో ప్రతిఏటా రాష్ట్రస్థాయిలో మండపేటలో పాల పోటీలు, పశువుల అందాల పోటీలు నిర్వహించి ప్రోత్సహించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐదేళ్లలో ఒక్కసారి కూడా అలాంటి పోటీలు నిర్వహించిన పాపాన పోలేదు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పశువులు సంఖ్య, ఆవులు 75,460 గేదేలు, 1,53,542, మేకలు, 25,111, గొర్రెలు, 23,518, పందులు, 6268 వరకు ఉన్నాయి.



సైలజ గడ్డి

టీడీపీకి కంచుకోట

బూరుగుపూడి



సీతానగరం, ఏప్రిల్ 30: తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి గతంలో ఉన్న బూరుగుపూడి నియోజక వర్గం కంచుకోటగా నిలిచేది. బూరుగుపూడి నియోజకవర్గంలో 1983లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పెందుర్తి సాంబశివరావు గెలుపొందారు. తదుపరి 1985లో జరిగిన ఎన్నికలలో రెండో సారి తెలుగుదేశం తరపున పెందుర్తి సాంబశివరావు గెలిచారు. 2 సార్లు ఎమ్మెల్యేగా చేసిన తర్వాత 1989లో బదిరెడ్డి అప్పన్న దొర ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. 1994లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసిన కోర్పు వెంకట రామకృష్ణ గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం తరపున పోటీచేసిన కోర్పు అచ్చిమాంబ గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీచేసిన చిట్టూరి రవీంద్ర గెలుపొందారు. 2009లో పునర్విభజన అనంతరం జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పెందుర్తి వెంకటేష్ గెలిచారు. 2014లో రాజానగరం నియోజకవర్గంగా మారిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలలో పెందుర్తి వెంకటేష్ తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికలలో వైసీపీ తరపున పోటీ చేసిన జక్కంపూడి రాజా గెలుపొందారు. ఇక్కడ 9 ఎన్నికలలో 6 సార్లు తెలుగుదేశం గెలవగా 2 సార్లు కాంగ్రెస్ పార్టీ ఒకసారి వైసీపీ విజయం సాధించింది. ఇప్పటికీ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న రాజానగరం నియోజకవర్గంలో ఈ సారి సైకిల్ గుర్తు లేకుండానే ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ, జనసేన, తెలుగుదేశం పొత్తులో భాగంగా రాజానగరం జనసేనకు కేటాయించడంతో ఇక్కడ కూటమి తరపున జనసేన గుర్తుతో బత్తుల బలరామకృష్ణ పోటీలో ఉన్నారు.

12 రకాల కార్డులు ఓకే



కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 30: ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డుతో పాటు మరో 12 రకాల కార్డులను చూపించవచ్చునని కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆధార్‌కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, బ్యాంకు కానీ పోస్టాఫీస్ ఫొటోలతో కూడిన పాస్‌బుక్‌లు చూపించవచ్చునన్నారు. అలాగే కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఫొటోలతో జారీ చేసిన సర్వీస్ గుర్తింపు కార్డులు వినియోగించాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అఫీషియల్ గుర్తింపు కార్డులు, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన యునిక్ డిజెబులిటీ ఐడీ కార్డులను చూపించాలన్నారు.

రామచంద్రపురం నియోజకవర్గం




ఎస్.ఆర్.కె.నరసరాజు



నందివాడ సత్యనారాయణ



నున్న వీర్రాజు



పిల్లి అప్పారావు



ఎస్.ఆర్.కె.రామచంద్రరాజు



మేడిశెట్టి రామారావు




పిల్లి సుభాష్‌చంద్రబోస్



తోట త్రిమూర్తులు



ద్రాక్షారామ ఆలయం



రామచంద్రపురం కోట

ఎన్నిక	విజేత	పార్టీ
1952	ఎస్.ఆర్.కె.నరసరాజు	ప్రజాపార్టీ
1953	కె.పట్టాభిరామయ్య	సీపీఐ
1955	ఎస్.ఆర్.కె రామచంద్రరాజు	ప్రజాపార్టీ
1962	నందివాడ సత్యనారాయణరావు	స్వతంత్ర
1967	నున్న వీర్రాజు	స్వతంత్ర
1970	మల్లిపూడిరామసంజీవరావు	కాంగ్రెస్(ఏకగ్రీవం)
1972	డి.సత్యనారాయణరెడ్డి	కాంగ్రెస్
1978	పిల్లి అప్పారావు	స్వతంత్ర
1982	ఎస్.ఆర్.కె.రామచంద్రరాజు	టీడీపీ
1985	ఎం.వి.వి.రామారావు	టీడీపీ
1989	పిల్లి సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్
1994	తోట త్రిమూర్తులు	స్వతంత్ర
1999	తోట త్రిమూర్తులు	టీడీపీ
2004	పిల్లి సుభాష్‌చంద్రబోస్	స్వతంత్ర
2009	పిల్లి సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్
2012	తోటత్రిమూర్తులు(ఉపఎన్నిక)	కాంగ్రెస్
2014	తోట త్రిమూర్తులు	టీడీపీ
2019	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ	వైసీపీ

'స్వతంత్ర' భావాల కోట

● (ద్రాక్షారామ)

పుణ్యతీరం

20 కిలోమీటర్లలో గౌతమినది తీరం.. దక్షిణకాశీగా పేరొందిన పంచారామ క్షేత్రం..మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారు కొలువు దీరిన పుణ్యధామం. కోటిపల్లి వంటి పుణ్యక్షేత్రాలకు నెలవైంది రామచంద్రపురం నియోజకవర్గం.. రాజకీయంగా సంచలన తీర్పులు ఇచ్చే ఓటర్లు ఉన్న స్వతంత్ర అభ్యర్థుల స్థావరం ఇది..కె.గంగవరం మండలం కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు 18 కిలోమీటర్లు గౌతమీ నదీ తీరం రామచంద్రపురానికి వరం. ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాలు ద్రాక్షారామ భీమేశ్వరాలయం, కోటిపల్లి ఛాయాసోమేశ్వర స్వామి ఆలయం ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఆధ్యాత్మిక, ప్రశాంతతలకు నిలయమైన ఆదివారపుపేట బాలయోగి ఆశ్రమం ఈ ప్రాంతంలోనిదే....

స్వరూపం..

ఆది నుంచి రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం పట్టణం, మండలం, పామర్రు మండలం, కపిలేశ్వరపురం మండలంలో మాచర, కోరుమిల్లి, టేకి, వాకతిప్ప గ్రామాలతో నియోజకవర్గంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కాజులూరు మండలాలతో నియోజకవర్గంగా ఏర్పాటయ్యింది.

రెవెన్యూ డివిజన్

రామచంద్రపురం నియోజకవర్గం రాజమండ్రి ఆర్డీవో పరిధిలో ఉండేది. 2013లో రామచంద్రపురం కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటయ్యింది. రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, అనపర్తి, బిక్కవోలు మండలాలతో ఆవిర్భవించింది. నూతన జిల్లాల ఏర్పాటుతో 5 మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతోంది.

వలసకు కేంద్రం

రామచంద్రపురం నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం, కొన్ని గ్రామాల్లో ఆక్వాసాగు జరుగుతోంది. కౌలు సాగు చేసుకునే కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు అధికంగా ఉన్నారు. వ్యవసాయం రంగం కుదేలు కావడంతో గ్రామాల నుంచి రైతుకూలీలు హైదరాబాద్‌కు వలసలు పోతున్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామం నుంచి 25 నుండి 100 కుటుంబాలు వరకు హైదరాబాద్‌కు వలస వెళ్లాయి. వ్యవసాయేతర పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. యానాం నుంచి కె.గంగవరం మీదుగా హైదరాబాద్‌కు 8 సర్వీసులు, కాకినాడ నుంచి ద్రాక్షారామ, రామచంద్రపురం మీదుగా పదుల సంఖ్యలో బస్సు సర్వీసులు నిర్విరామంగా నడుస్తున్నాయంటే వలసల తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

గోదారి ఈత

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉండగా నియోజకవర్గానికి జిల్లా కేంద్రం కాకినాడ అందుబాటులో ఉండేది. ప్రస్తుతం డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో చేర్చడంతో అమలాపురానికి ప్రజలు వెళ్లాలంటే లంక మేత గోదారి ఈతగా మారింది. అయితే కోటిపల్లి వద్ద పంటు దాటి వెళ్లాలి...లేదా రావులపాలెం మీదుగా గాని యానాం మీదుగా గాని 50 కిలోమీటర్లుకు పైగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోటిపల్లి ముక్తేశ్వరం వంతెన నిర్మాణం జరిగితే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదు.



చెల్లుబోయిన వేణు



ఆర్టోస్ కంపెనీ

సంచలన తీర్పులు

నియోజకవర్గానికి 14 సార్లు సాధారణ ఎన్నికలు జరుగగా 5 సార్లు స్వతంత్ర అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నందివాడ సత్యనారాయణ 1962లో తొలి సారి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. తదుపరి 1967లో నున్న వీర్రాజు, 1978లో పిల్లి అప్పారావులు స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు. 1994లో తోట త్రిమూర్తులు, 2004లో పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు స్వతంత్య అభ్యర్థులుగా గెలుపొందారు. 1994లో గుత్తుల సూర్యనారాయణబాబుకు టీడీపీ టికెట్ కేటాయించడంతో వ్యతిరేకించిన నాయకులు తోట త్రిమూర్తులను స్వతంత్ర అభ్యర్థిగా నిలిపి గెలిపించారు. తెలుగుదేశం ప్రభంజనంలో తోట గెలుపొందారు. అదే విధంగా 2004లో కాంగ్రెస్ పార్టీ టికెట్ పంపన అర్జునరావుకు ఇచ్చారు. దీంతో పిల్లి సుభాష్ చంద్రబోస్ స్వతంత్య అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభంజనంలో బోస్ గెలుపొందారు. 1970లో జరిగిన ఉప ఎన్నికలో మల్లిపూడి సంజీవరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న చరిత్ర రామచంద్రపురం ఓటర్లకుంది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఒకేపార్టీ(గుర్తుపై)వరుసగా రెండుసార్లు గెలిచినవారులేరు. ఇంతటి సంచలన తీర్పునిచ్చే ఓటర్లు ఉన్న నియోజకవర్గం రామచంద్రపురం.

సమస్యలు ఇవీ

కె.గంగవరం మండల కేంద్రం, కోటిపల్లిలో తాగునీటి సమస్య ఉంది. ఆక్వా సాగుతో భూగర్భ జలాలు కలుషితం కావడంతో తాగునీటి సమస్యలు పలు గ్రామాలు ఎదుర్కొంటున్నాయి. కాజులూరు మండలంలో శిథిలమైన వంతెనలు, రహదారులు దెబ్బతినడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ద్రాక్షారామలో కంపోస్టు యార్డు పెద్ద సమస్యగా ఉంది. రామచంద్రపురం పట్టణంలో ఇంటింటికి తాగునీరు అందించాల్సి ఉంది. టిడ్కో గృహాల సముదాయంలో మౌలిక వసతులు కల్పన పూర్తి చేయాలి. అక్రమ పశు కబేళా సమస్య పట్టణ, మండల ప్రజలను దశాబ్దాలుగా పట్టి పీడిస్తోంది.

బియ్యం, ఆక్వా ఎగుమతులకు కేంద్రం

రామచంద్రపురం బియ్యం, ఆక్వా ఎగుమతులకు కేంద్రంగా మారుతోంది. కోటిపల్లి, ముక్తేశ్వరం మధ్య గోదావరిపై బ్రిడ్జి నిర్మాణం జరగాలి. దీంతో కోనసీమప్రాంతానికి కాకినాడ మరింత దూరాభారం తగ్గుతుంది. రవాణా పెరగడంతో కోటిపల్లి నుంచి ద్రాక్షారామ మీదుగా గొల్లపాలెం వరకు ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించిన జొన్నాడ నుంచి యానాం వరకు ఏటిగట్టు విస్తరణ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే రెండు జాతీయ రహదారుల అనుసంధానం అవుతుంది. దీంతో పాటు గౌతమీ నదీతీరం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి సాధిస్తుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి.

ప్రసిద్ధి కట్టడం రాజా వారి కోట

రామచంద్రపురంలో ప్రసిద్ధిగాంచిన కట్టడం రాజావారి కోట. కోటలో ఎన్నో చలన చిత్రాలు షూటింగ్‌లు జరుపుకుని ఘన విజయం సాధించాయి.. అదే విధంగా స్వదేశీ శీతల పానీయం ఆర్టోస్. కామర్ల రోగులకు వెల్ల కామెర్ల మందు రాష్ట్రంలో పేరుగాంచింది.

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు: 203153
పురుషులు: 100628
స్త్రీలు: 102524
ఇతరులు:1

ఇంటర్వ్యూ

ఎప్పుడూ ప్రజలతోనే..

ప్రజల్లోనే ఉంటా



- నన్ను గెలిపించుకోవాలని ప్రజలే అనుకుంటున్నారు
- ప్రతిఒక్కరికీ ఇళ్లు, విద్య, వైద్యం, ఉపాధి, తాగు, సాగునీరు.. వీటిపైనే నా ప్రధాన దృష్టి
- జగ్గంపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

ప్ర: ప్రస్తుత ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

జ: చాలా ఆనందంగా సాగుతోంది. అంతా ప్రశాంత వాతావరణంలో ఎక్కడికి వెళ్లినా పాజిటివ్ స్పందనే ఉంది.

ప్ర: ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు?

జ: రైతులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. మధ్య తరగతి వాళ్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ప్ర: మీకున్న గెలుపు అవకాశాలేంటి? ఎందుకంత ధీమా?

జ: జగ్గంపేట నియోజకవర్గంలో జ్యోతుల నెహ్రూనే మళ్లీ గెలిపించుకోవాలనే ఉద్దేశ్యం మూడేళ్లనుంచి ప్రజల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేక, స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధుల తీరే నా గెలుపు అవకాశంగా ఉంది. ఎక్కడికి వెళ్లినా అనుకూల పరిస్థితులే ఉండడంవల్ల ఎన్నికలపై ధీమాగా ఉంటున్నా.

ప్ర: గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయమేంటి?

జ: రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు 20ఏళ్లు పోయినా సరిదిద్దలేని విధంగా ఉన్నాయి. అంతకంటే అన్యాయం లేదు.

ప్ర: ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు?

జ: ఎప్పుడూ ప్రజలకు అందుబాటులోనే ఉంటా. ఇప్పుడు రేపు గెలిచాక కూడా ప్రజలతోనే, ప్రజల్లోనే ఉంటా.

ప్ర: ఇక్కడ మెజారిటీ వర్గాల కోసం మీరేమి చేయబోతున్నారు?

జ: అందరికీ న్యాయం చేయడానికి సిద్ధం ఉన్నాను. నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుంటా.

ప్ర: గెలిచాక ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు?

జ: కూటమి మేనిఫెస్టో అమలుతోపాటు స్థానికంగా నియోజకవర్గంలో నా మేనిఫెస్టో ప్రకారం ప్రధానంగా విద్య వైద్యం, ఉపాధి, ఇళ్లు, సాగునీరు వంటి ఐదుఅంశాలపై దృష్టిసారిస్తాను. విద్యపరంగా అన్ని రంగాల్లోను నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో నిలపడానికి వృత్తిపరమైన కళాశాలను తీసుకొస్తాను. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేలా ప్రభుత్వ వైద్యశాలలను నిర్మించి ప్రతి పేదవాడికి వైద్యం అందించేలా కృషి చేస్తాను. సాగునీటి కష్టాలకు తీర్చడానికి పుష్కర ఎత్తిపోతల పథకానికి నీరు పూర్తిస్థాయిలో అందిస్తాను. మెట్ట ప్రాంతంలో నీటికి కటకటలాడుతున్న గోకవరం, గండేపల్లి, జగ్గంపేట మండలాలకు మల్లవరం ప్రాజెక్టును రూ.130కోట్ల మంజూరు చేసినా ఆపేసిన పనులను మా ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తిచేసి తాగు, సాగునీరు కల్పిస్తాను. ఏలేరు కాలవ ద్వారా జగ్గంపేట, కిర్లంపూడి మండలాలతోపాటు పక్కనున్న ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాలకు తాగునీరు పూర్తిగా అందిస్తాం. పిల్ల కాలువల మరమ్మతులు చేసి చివరి ఆయకట్టువరకు నీరందిస్తాను. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం. అన్ని సామాజిక వర్గాలకు ప్రాంతాల వారీగా టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రతిఒక్కరికీ ఇళ్లు అందిస్తాను.

ప్ర: కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

జ: కూటమి పార్టీల సహకారం మరువలేనిది. జనసేన సహకారంతో మరింత మెజార్టీ చేకూరే అవకాశముంది.

ప్ర: ప్రచారంలో మీ కుటుంబసభ్యుల సహకారం ఎలా ఉంది?

జ: అందరూ ప్రచారంలో బాధ్యత తీసుకున్నారు. నా కుటుంబ సభ్యులంటే జగ్గంపేటలోని టీడీపీ, జనసేన కార్యకర్తలే. వారి బలంతోనే ఎన్నికల్లో నిలబడ్డా.

ప్ర: మీ పార్టీ ఎన్నికల హామీలపై జన స్పందన ఏంటి?

జ: జనం నమ్మడం వల్లే స్పందన వస్తోంది. అంతా అనుకూలంగా ఉంది.



నేడు ఉప్పెన సినిమా హీరో వైష్ణవ్‌తేజ్ రోడ్‌షో

కొత్తపల్లి, ఏప్రిల్ 30: పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలో బుధవారం ఉప్పెన సినిమా హీరో వైష్ణవ్ తేజ్ పర్యటించనున్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పవన్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మత్సా అప్పాజీ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రోడ్డు షో వివరాలను తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పిఠాపురం నవఖండ్రవాడ నుంచి వైష్ణవ్ తేజ్ రోడ్డుషో ప్రారంభిస్తారన్నారు. అనంతరం కొత్తపల్లి మండలం కొండెవరం, ఇసుకపల్లి మీ దుగా నాగులాపల్లి, రమణక్కపేట, రామరాఘవపురం, ముమ్మిడివారిపోడులో పవన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తారన్నారు. అనంతరం శ్రీరాంపురం నుంచి కోనపాపపేట, శీలంవారిపాలెం మీదుగా మూలపేట సెజ్ కాలనీ చేరుకుంటారని చెప్పారు. అక్కడ నుంచి మూలపేట సెంటర్‌లో రోడ్డుషోలో ప్రసంగిస్తారన్నారు. రామన్నపాలెం, అమీనాబాద్ సెంటర్ నుంచి యండపల్లి ఎస్సీ పేట, యండపల్లి జంక్షన్, కొత్తపల్లి మీదుగా ఉప్పాడ బీచ్‌రోడ్ సెంటర్లో రోడ్‌షోలో ప్రచారం నిర్వహిస్తారని, భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. గవర రాంబాబు, మురాలశెట్టి సునీల్‌కుమార్, కంబాల దాసు, గుండా అప్పారావు, గవర నాగేశ్వరరావు తదితర టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కుమారుడి చిత్రహింసలు భరించలేక..

ఇనుపరాడ్డుతో కొట్టిచంపిన తండ్రి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 30: వ్యసనాలకు బానిసై చిత్రహింసలకు గురి చేస్తున్న కొడుకుని కన్న చేతులే హతమార్చాయి. వేధింపులు తాళలేక విసిగివేసారిపోయిన కన్న తండ్రే కొడుకును కడతేర్చాడు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పిల్లకాలువ రోడ్డు సమీపంలోని వివేకానంద పాఠశాల వీధిలో ఈ సంఘటన జరిగింది. ఈ వీధిలోని ఓ ఇంట్లో గుడాల వీరవెంకటరమణ(బుజ్జి), భార్య లక్ష్మి, కొడుకు అరవింద్ కొన్నేళ్లుగా నివాసముంటున్నారు. కుమార్తెకు వివాహం చేసి అత్తవారింటికి పంపించారు.





అరవింద్(ఫైల్)

అయితే కొడుకు గుడాల అరవింద్(25)గంజాయి, మద్యానికి బానిసై చెడువ్యసనాలకు లోనయ్యాడు. అంతేకాకుండా ఇటీవల ఓ కారుడ్రైవర్‌పై కత్తితో దాడి చేసినట్లుగా చెబుతున్నారు. ప్రతీరోజూ తాగేసి ఇంటికి రావడం డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించడం అలవాటుగా మారింది. అయితే సోమవారం రాత్రి కూడా ఇంటికి తాగేసి వచ్చిన అరవింద్ రచ్చ చేశాడు. దీంతో తండ్రికి కొడుకుకి వాగ్వాదం జరగ్గా సహనం కోల్పోయిన తండ్రి కొడుకు అరవింద్‌ను రాడ్డుతో కొట్టి హతమార్చాడు. కొన్నిరోజులుగా రెండులక్షలు కావాలని తల్లిదండ్రులను అరవింద్ వేధిస్తున్నట్లు తెలిసింది. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఇంద్రపాలెం ఎస్‌ఐ మణికుమార్ హత్య జరిగిన ఇంటిని పరిశీలించి విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామని, అరవింద్ తల్లి ఫిర్యాదు మేరకు హత్య కేసుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండపేటలో వారాహి యాత్ర

హాజరుకానున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

మండపేట, ఏప్రిల్ 30: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం పది గంటలకు మండపేటలో జరిగే వారాహి బస్సు యాత్రలో పాల్గొంటారని నియోజకవర్గ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ నేతలు కె.సత్యనారాయణ, కె.సాయిరాం తెలిపారు. బుధవారం ఉదయం పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మండపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగి బైపాస్ రోడ్డు నుంచి రోడ్డు మార్గంలో పవన్ మండపేట చేరుకుంటారన్నారు. మండపేట కలువపువ్వు సెంటరులో జరిగే బహిరంగ సభలో పవన్ పాల్గొంటారని తెలిపారు. మండపేటలో జరిగే పవన్‌కల్యాణ్ బహిరంగ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణులు అంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని నేతలు కోరారు.

స్నేహితుడి మృతదేహాన్ని బైక్‌పై పెట్టుకుని..



ఆత్రేయపురం, ఏప్రిల్ 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం బొబ్బర్లంక పరిధిలోని బ్యారేజీ వద్ద రాజమహేంద్రవరం రూరల్ నామవరానికి చెందిన కొంత మంది యువకులు గోదావరిలో స్నానం చేసి ఆటపాటలతో సందడి చేశారు. అందులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. సహచర మిత్రులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. దీంతో అతడిని బైక్‌పై కూర్చోబెట్టుకుని నామవరం తీసుకెళ్లారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

పిఠాపురం మద్యం కేసులో మరో ఇద్దరి అరెస్టు

కేసులోని వైసీపీ నేతలు పరారీలో ఉన్నారట!

పిఠాపురం, ఏప్రిల్ 30: పిఠాపురం పట్టణంలో పట్టుబడిన గోవా తయారీ మద్యం కేసుల్లో మరో ఇద్దరిని ఎస్‌ఈబీ అధికారులు అరెస్టు చేశారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ గార్డెన్స్, సాలిపేట, జగ్గయ్యచెరువు కాలనీ, మండలంలోని కుమారపురం గ్రామాల్లో ఈనెల 26వ తేదీ రాత్రి ఏకకాలంలో పోలీసు, సెబ్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించి కోటి రూపాయిలు విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు రెండు కేసులు, సెబ్ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. జగ్గయ్యచెరువు, కుమారపురంల్లో దొరికిన మద్యానికి సంబంధించి పిఠాపురం పట్టణ, రూరల్ పోలీసుస్టేషన్‌ల్లో కేసులు నమోదు కాగా వాటిల్లో సదరు ఇంటి యజమానులు ఇద్దరితో పాటు సరుకు దింపిన ఆటో డ్రైవర్లు ఇద్దరిని మొత్తం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెబ్ అధికారులు నమోదు చేసిన రెండు కేసులకు సంబంధించి వారు గోప్యత పాటించడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇందులో వైసీపీ నేతలను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఎట్టకేలకు సెబ్ అధికారులు స్పందించి వైఎస్‌ఆర్ గార్డెన్స్, సాలిపేటల్లో దొరికిన మద్యానికి సంబంధించి గండికోట దుర్గారామయ్య, నారపురెడ్డి గణేష్‌లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పరారీలో ఉన్నారట..

వైఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మద్యం పట్టుబడిన ఇంటి యజమాని, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు సోదరుడు వీరబాబు, సాలిపేట కేసులో ఇంటి యజమాని అయిన మరో వైసీపీ నేత అయిన అంబటి వీర వెంకట సత్యనారాయణరెడ్డిలు పరారీలో ఉన్నట్లు సెబ్ అధికారులు చెబుతున్నారు. పోలీసులు దాడులు నిర్వహించిన వెంటనే అందరిని అరెస్టు చూపించగా, సెబ్ అధికారులు విచారణలో నిర్లిప్తంగా వ్యవహరించడం విమర్శలకు గురయింది. వైసీపీ నేతలు స్థానంలో వేరే వారిని పెట్టే ప్రయత్నాలు సాగినట్లు ఆరోపణలు వచ్చాయి. కేసును నీరుగార్చే ప్రయత్నాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయిన వార్తా కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇప్పుడు అధికారులు యజమానులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ తెచ్చుకునేందుకు వీలుగా సెబ్ అధికారులు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకు వారిని అరెస్టు చేయడం లేదని చెబుతున్నారు.

గాండ్ల కులస్తుల గౌరవాన్ని పెంపొందిస్తాం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 30: నూనె ఉత్పత్తి చేయి వృత్తి ఆధారిత కులస్తులయిన గాండ్ల తెలికుల, దేవ తిలకుల గౌరవాన్ని పెంపొందించే దిశగా కృషి చేస్తామని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. గాండ్ల తెలికుల దేవ తిలకుల ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) నాయకులు మంగళవారం పిఠాపురంలో నాగబాబును కలిసి తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో 10లక్షలకు పైగా ఉన్న గాండ్ల కులస్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి సహకారం లేక 70శాతం కులస్తులు వృత్తికి దూరమయి కూలీలుగా బతకాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. నెలకు కనీసం 300 యూనిట్లు వరకూ విద్యుత్‌రాయితీ ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. సినీనటుడు బాలాజీ, జేఏసీ ప్రతినిధులు గోసు సుబ్బారావు, అడ్డా వీరవెంకటరాజు, దాడి సత్యనారాయణ, చిట్టాల సూర్యనారాయణమూర్తి, బొర్రా మధుసూదన్, కాశిన సత్యనారాయణ, తిరుపతి హరగోపాల్ ఉన్నారు.

'మతం పేరుతో ఓట్లు దండుకున్నారు'

క్రిస్టియన్ మతం పేరు చెప్పుకుని ఓట్లు దండుకున్న వైసీపీ పాలనలో క్రిస్టియన్ మిషనరీ భూములనే ఆక్రమించుకున్న ఘనతను జగన్ సొంతం చేసుకున్నారని సీబీఎం, సీబీఎస్‌ఈ మిషనరీ చైర్మన్ పరిమి ఇమాన్యూయల్ దీపక్‌కుమార్ విమర్శించారు. ఆయన నేతృత్వంలోని సంస్థ ప్రతినిధులు మంగళవారం పిఠాపురంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును కలిసి వారి భూములు ఆక్రమణకు గురైన విధానంపై వివరించారు.

టీడీపీ నేత గాయపడటం బాధ కలిగించింది : పవన్

పిఠాపురం, ఏప్రిల్ 30: పిఠాపురం మండలంలో జరిగిన జనసేన ప్రచారయాత్రలో గోకివాడ గ్రామ టీడీపీ అధ్యక్షుడు నామా పద్దరాజు (బుజ్జి) గాయపడటం బాధ కలిగించిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. గోకివాడలో పవన్ రోడ్‌షో కొనసాగుతుండగా కాన్వాయ్‌లోని వాహనం పద్దరాజు కాలు మీదుగా వెళ్లడంతో గాయపడ్డారు. దీనిపై పవన్ ఆవేదన వ్యక్తం చేస్తూ పద్దరాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పెదపూడిలో పురందేశ్వరి, నల్లమిల్లి రోడ్‌షో

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30: పెదపూడి మండలంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి పురందేశ్వరి, అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం రోడ్ షో నిర్వహించారు. ప్రచారానికి ప్రజలు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు పాల్గొన్నారు. మహిళలు, గ్రామస్తులు మంగళహారతులతో ఆహ్వానం పలికారు. భారీగా బైక్‌ర్యాలీ చేపట్టారు.

నీటి సమస్య పరిష్కారానికి టోల్‌ఫ్రీ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 30: ప్రస్తుత వేసవిలో మంచినీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని, ఏ ప్రాంతంలోనైనా నీటి సమస్య ఎదురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 18004 255990 నెంబర్‌కు కాల్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు.

కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేయాలి

కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30: జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు శెట్టిబలిజ సంఘీయులంతా కలిసికట్టుగా పనిచేయాలని కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ మెయిన్‌రోడ్‌లోని సరోవర్ పోర్టికోలో కాకినాడ సిటీ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘీయుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి సంఘం అధ్యక్షుడు చొల్లంగి వీరబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా కూటమి కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొండబాబు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాకారంకానుందన్నారు. నాయకులు ప్రెసింగి ఆదినారాయణ, బొలిశెట్టి సత్య, శెట్టిబలిజ సాధికారి సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, కాకినాడ సిటీ బీసీ సెల్ అధ్యక్షుడు వొమ్మి బాలాజీ, అధికంగా శెట్టిబలిజ సంఘీయులు ఉన్నారు.

ఉదయ్‌కు మద్దతుగా ప్రచారం

కాకినాడ పార్లమెంట్ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు మద్దతుగా కాకినాడ రూరల్, సిటీల్లో నాయకులు ప్రచారం చేపట్టారు. కాకినాడ రూరల్ మండలం హార్బర్‌పేటలో జనసేన పార్టీ కాకినాడ పార్లమెంటరీ ప్రచార కమిటీ సభ్యుడు టీవీ రామారావు ఎన్నికల ప్రచారం నిర్వహి ంచారు. మత్స్యకార ప్రాంతమైన హార్బర్‌పేటలో ఇంటింటికీ వెళ్లి కాకినాడ ఎంపీగా తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను, రూరల్ ఎమ్మెల్యేగా పంతం నానాజీని గాజుగ్లాసు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 10వ డివిజన్ టీడీపీ నాయకులు చోడిపల్లి సతీష్ ఆధ్వర్యంలో దుమ్ములపేటలో టీడీపీ, జనసేన కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోలోని హామీలను ప్రజలకు వివరించారు.



కాకినాడ సిటీ: సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్ శ్రీనివాస్



తునిరూరల్: తిమ్మాపురం సభలో మాట్లాడుతున్న ఉదయ్ శ్రీనివాస్



కార్పొరేషన్: ఎన్నికల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉదయ్

దొంగదారుల్లో వైసీపీ : తంగెళ్ల

తుని రూరల్, ఏప్రిల్ 30: కూటమి అభ్యర్థులను ఎదుర్కోలేక వైసీపీ నాయకులు దొంగదారుల్లో ఎన్నికలకు సిద్ధమయ్యారని కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. తుని మండలం బి.తిమ్మాపురం గ్రామంలో తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య అధ్యక్షతన జరిగిన రోడ్‌షో, బహిరంగ సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ నాయకులకు ఓటు అనే ఆయు ధంతో బుద్ధి చెప్పాలని స్పష్టం చేశారు. యనమల దివ్య మాట్లాడుతూ సేవే పరమావధిగా ప్రజల్లోకి వచ్చానని, ఇకపై ఎప్పటికీ ప్రజల మధ్యే ఉంటానని తనను ఆశీర్వదించి అఖం డ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, కొయ్యా శ్రీనుబాబు, యనమల రాజేష్, చోడిశెట్టి గణేష్‌లు ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరపా అప్పారావు, కోడా వెంకటరమణ, కాపారపు అబ్బులు, అచ్యుతరావు, జక్కాన రామునాయుడు తదితరులు ఉన్నారు.

బీజేపీ ఎన్నికల కరపత్రాల ఆవిష్కరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 30: బీజేపీ సమర్థక్ మంచ్ ఎన్నికల కరపత్రాలను జనసేన పార్టీ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఆవిష్కరించారు. స్థానిక విద్యుత్ నగర్‌లో ఉదయ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సమర్థక్ మంచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెండెం శ్రీదేవి మాట్లాడారు. బీజేపీ నాయకులు పొనుగుపాటి చిన్నసుబ్బారావు, జి.పద్మ, చిన అప్పాజీ, చోడిశెట్టి రమేష్, మణిబాల, కళ, గోవిందు, నాగు, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.

జాబు రావాలంటే బాబు రావాలి

కోరుకుంటున్న రాష్ట్ర యువత

కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి





కాకినాడలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతున్న కొండబాబు, పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30: ఆంధ్ర రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, జాబు రావాలంటే బాబు రావాలని యువత కోరుకుంటున్నారని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. 14వ డివిజన్ ఏటిమొగలో మంగళవారం ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత ఎన్నిక ప్రచారంలో జగన్ 5లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారని, ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని మోసపూరిత మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా మోసం చేశాడన్నారు. ఉద్యోగావకాశాలు కల్పించి యువతను ఆదుకోవాల్సింది పోగా యువతను డ్రగ్స్, గంజాయి మత్తుకు బానిసలను చేసి యువత భవిష్యత్తును నాశం చేశాడన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి నూతన పరిశ్రమలు తీసుకురాకుండా ఉన్న పరిశ్రమలను జే ట్యాక్స్ పేరుతో ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేసి యువతను దగా చేశాడన్నారు. రాబోయే తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి ఉద్యోగాలు రాని వారికి నిరుద్యోగ భృతి అందించి ఆదుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సంగిశెట్టి అశోక్, టీడీపీ నాయకులు సుంకర తిరుమల కుమార్, పెనుపోతు సూర్యారావు, బలసాడి రంగారావు, వనమాడి ఉమాశంకర్, సంగాని సత్తిబాబు, సంగాని చిన్ని, వనమాడి వీరాస్వామి, సంగాని నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు అంగాడి దుర్గారావు, పినపోతు రాంబాబు, పినపోతు జీవరత్నం, బొడ్డు రవికుమార్, పాలెపు ధర్మారావు, అరదాడి శివ, బొమ్మిడి సతీష్, పినపోతు దుర్గారావు, మల్లాడి ఏడుకొండలు, సంగాడి ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సభలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

43వ డివిజన్ నుంచి చేరికలు..

స్థానిక 43వ డివిజన్ వైసీపీ నాయకులు కోకా సత్తిబాబు, వాసంశెట్టి శివ, వేములపూడి రాజు వారి అనుచరులతో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిం చారు. స్థానిక 41వ డివిజన్‌లో వనమాడి హేమంత్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలను ప్రజలకు వివరించారు.



తెలుగుదేశంపార్టీలో చేరినవారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించిన వనమాడి కొండబాబు

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు

కాకినాడ సిటీ నియోజకవర్గం

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
1.వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు)	టీడీపీ	సైకిల్
2.ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
3.చెక్కా నూకరాజు	కాంగ్రెస్	హస్తం
4.కంభం రాజుబాబు	బీఎస్పీ	ఏనుగు
5.కాట్రు నాగబాబు	తెలుగు నవగర్జన పార్టీ	డైమండ్
6.చక్రవర్తి గింజాల	జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ	కోటు
7.మునగాల సాయిగోపి	తెలుగు జనతాపార్టీ	గాజుగ్లాసు
8.లీలా సూర్యకిరణ్ యనమండ్ర	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	టీవీ
9.ఎం.వెంకటేశ్వరరావు(బండబాబు)	నవరంగ్ కాంగ్రెస్	బకెట్
10.వి.వెంకటేశ్వరరావు(కొండబాబు)	జాతీయ జనసేన	పెన్‌స్టాండ్
11.కసింకోట చంద్రశేఖర్	స్వతంత్ర్య అభ్యర్థి	స్టూల్
12.ఎం.ప్రభాకరరావు	స్వతంత్ర్య అభ్యర్థి	బ్యాట్
13.బి.భైరవస్వామి	స్వతంత్ర్య అభ్యర్థి	ఓడ
14.టి.శ్రీనివాసరావు	స్వతంత్ర్య అభ్యర్థి	క్యాన్
15.సతీష్‌కుమార్	స్వతంత్ర్య అభ్యర్థి	విజిల్

పిఠాపురం నియోజకవర్గం

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
1.కొణిదెల పవన్‌కళ్యాణ్	జనసేన	గాజుగ్లాసు
2.వంగా గీతా విశ్వనాథ్	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
3.బుల్లిరాజు ప్రత్తిపాటి	బీఎస్పీ	ఏనుగు
4.మాదేపల్లి సత్యానందరావు	కాంగ్రెస్	హస్తం
5.జగ్గారపు మల్లికార్జున	జైభీమ్‌రావుభారత్‌పార్టీ	కోటు
6.తమన్నాసింహాద్రి	భారత చైతన్యయువజనపార్టీ	గన్నాకిసాన్
7.పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు	తెలుగుజనతాపార్టీ	మైక్
8.మద్దూరు వీరబాబు	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
9.ఈటి జగదీష్	ఇండిపెండెంట్	బ్యాటరీటార్చ్
10.ఏడిద భాస్కరరావు	ఇండిపెండెంట్	టెలివిజన్
11.గౌరీ మని బొలిశెట్టి	ఇండిపెండెంట్	లెటర్‌బాక్స్
12.నాగం సూరిబాబు	ఇండిపెండెంట్	డిష్‌యాంటెన్నా
13.సాయి సూర్య నిఖిల్ వేగిశెట్టి	ఇండిపెండెంట్	బెలూన్

జగ్గంపేట నియోజకవర్గం

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
1.జ్యోతుల వెంకట అప్పారావు(నెహ్రూ)	టీడీపీ	సైకిల్
2.తోట వెంకటాచలం	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
3.మరోతి శివగణేష్	కాంగ్రెస్	హస్తం
4.జుత్తుక నాగేశ్వరరావు	బీఎస్పీ	ఏనుగు
5.సాదే నరేంద్రబాబు	లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ	బావి
6.కొత్తపల్లి సూరిబాబు	ఆర్‌పీఐ	కరెంటు స్తంభం
7.చిట్టూరి నాగలక్ష్మి	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
8.వల్లూరి సత్యానందం	జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ	కోటు
9.పాటంశెట్టి సూర్యచంద్ర	స్వతంత్ర్య అభ్యర్థి	గాజుగ్లాసు
10.బాలిరెడ్డి సాల్మన్‌రాజు	స్వతంత్ర్య అభ్యర్థి	ఉంగరం
11.డాక్టర్ సంకుమల్ల అప్పారావు	స్వతంత్ర్య అభ్యర్థి	ఎయిర్ కండీషనర్
12.బొడేటి అప్పారావు	స్వతంత్ర్య అభ్యర్థి	ఫుట్‌బాల్ క్రీడకారుడు
13.దొమ్మేటి కుసలన్న	స్వతంత్ర్య అభ్యర్థి	బ్యాట్
14.కాల్దారి రాణి	స్వతంత్ర్య అభ్యర్థి	గరాటు

ప్రత్తిపాడు నియోజకవర్గం

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
1.నీరుకొండ వీర వెంకట సత్యనారాయణ	కాంగ్రెస్	హస్తం
2.బుర్తి శ్రీనుబాబు	బీఎస్పీ	ఏనుగు
3.వరుపుల సత్యప్రభ	తెలుగుదేశం	సైకిల్
4.వరుపులసుబ్బారావు	వైసీపీ	సీలింగ్ ఫ్యాన్
5.ఏగుపాటి అరుణరావు	సీపీఐఎంఎల్(లిబరేషన్)	3నక్షత్రాల జెండా
6.ఆశిన శ్రీనివాస్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	టెలివిజన్
7.ఏడిద వరప్రసాద్‌కుమార్	ఆర్‌పీఐ	ఓడ
8.నేతల కొండబాబు	దళితబహుజనపార్టీ	గాజుగాసు
9.గొంప శివ	బీసీవై	గన్నాకిసాన్
10.దాడిశెట్టి వీరబాబు	జైభీమ్‌రావ్‌బారతపార్టీ	కోటు
11.కొత్తపల్లి అర్జునరావు	ఇండిపెండెంట్	ఆపిల్
12.గొంతిన శివరాజ	ఇండిపెండెంట్	బక్కెట్
13.నమ్మి గణేష్	ఇండిపెండెంట్	హావర్‌గాసు
14.పిల్లి బలరాముడు	ఇండిపెండెంట్	కొబ్బరితోట
15.సుర్ల శ్రీనివాస్	ఇండిపెండెంట్	విజిల్

కాకినాడ

నేడు 12 మండలాల్లో వడగాల్పులు : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 30: ఏపీ విపత్తుల సంస్థ హెచ్చరికల ప్రకారం బుధవారం 12 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ నివాస్ అన్నారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, కోటనందూరు, పెదపూడి, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం, సామర్లకోట, ఏలేశ్వరం మండలాల్లో వడ గాల్పులు వీచే అవకాశం ఉండ న్నారు. ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంట్లోనే ఉండాలని.. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'టీడీపీ వెన్నంటే బీసీ వర్గాలు'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 30: బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ ఆవిర్భవించిందని, బీసీ సామాజిక వర్గాలన్నీ ఎన్నటికీ టీడీపీతోనే ఉంటాయని ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) అన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నుంచి బీసీ సామాజిక వర్గాలకు చెందిన కాకరపల్లి చలపతిరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పలివెల త్రిమూర్తులు, గీసాల శ్రీనివాసరావు, గుడాల లోవరాజు, పాలిక సూరిబాబులను బీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యులుగా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నియమించారు. ఈ మేరకు మంగళవారం 47వ డివిజన్ కరణంగారి సెంటర్‌లో కటకంశెట్టి బాబీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను కాకినాడ రూరల్ అబ్జర్వర్ కూడుపూడి సత్తిబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, పార్టీ నాయకులు కొజు నెహ్రూ, కె. వినాయక్, దేవు వెంకన్న, యజ్జల బాబ్జీ, గుబ్బల బాలాజీ, బచ్చుల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శెట్టిబలిజ సామాజికవర్గ ఎన్నికల ప్రచార కమిటీ నియామకం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30: కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ శెట్టిబలిజ సామాజిక వర్గ ఎన్నికల ప్రచార కమిటీని కాకినాడ పార్లమెంట్ టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ తోట నవీన్ నియమించి మగళవారం నియామక పత్రం జారీ చేశారు. కమిటీలో సభ్యులుగా కాకరపల్లి చలపతిరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పలివెల త్రిమూర్తులు, గీసాల శ్రీనివాసరావు, గుడాల లోవరాజు, పాలిక సూరిబాబు వ్యవహరిస్తారు.

'పింఛన్లు పంపిణీ చేయాలి'

ఏలేశ్వరం, ఏప్రిల్ 30: పెన్షన్లు ఇంటింటికీ పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు డిమండ్ చేశారు. మంగళవారం కౌన్సిలర్ అలమండ చలమయ్య నివాసంలో టీడీపీ నాయకులతో విలేకర్లతో సమావేశంలో చలమయ్య మాట్లాడుతూ పింఛన్లను ఇప్పుడు కొత్తగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ సరికాదని, ఎండలో వృద్ధులు, వికలాంగులను బ్యాంకుల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. సమావేశంలో పాండ్రంకి అప్పారావు, వైబోగుల సుమ్మారావు, వాగు రాజేష్, గూడవిల్లి అర్జునరావు, బూర్లు సత్తిబాబు, చల్లా గణేష్, కడింశెట్టి వాసు, అలమండ వీర్రాఘవస్వామి, బెల్లాని శ్రీను ఉన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

టీడీపీ కూటమి పెద్దాపురం అభ్యర్థి చినరాజప్ప

పెద్దాపురం, ఏప్రిల్ 30: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ కూటమి కార్యకర్తలు పనిచేయాలని పెద్దాపురం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక సుధాకాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయం వద్ద పెద్దాపురం పట్టణ బూత్ కమిటీలతో మంగళవారం ఆయన సమావేశమై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సర్వనాశనంచేసిందన్నారు. ఈ సైకో ప్రభుత్వాన్ని ఓడించేందుకు మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయన్నారు. ఈ ఎన్నికలు చాలా కీలకమైనవని, ఎన్నికల్లో ఏవిధంగా ముందుకు సాగాలి, ఏవిధంగా పనిచేయాలి అనే అంశాలపై ఆయన కార్యకర్తలతో చర్చించారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో మరింత రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు పనిచేయాలన్నారు. పార్టీ గెలుపులో బూత్ కమిటీలే కీలమన్నారు. వార్డుల్లో క్షేత్రస్థాయి నుంచి ప్రతీఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సమన్వయంతో పనిచేస్తేనే విజయం సాధిస్తామని కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈసారి ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న ఎన్నికలన్నారు. ధర్మాన్ని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే డోర్ టూ డోర్ ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, విత్తనాల వెంకటరమణ, కర్రి వెంకటరమణ, రంధి సత్యనారాయణ, పొలమరశెట్టి సత్తిబాబు, తూతిక రాజు, బొడ్డు ఉదయశంకర్, నూనె రామారావు, కొరిపూరి రాజు, అరీఫ్ అలీ పాల్గొన్నారు.



పెద్దాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప, సమావేశానికి హాజరైన కార్యకర్తలు



పెద్దాపురం: టీడీపీలో చేరినవారితో చినరాజప్ప

వైసీపీపై తిరుగుబాటు ప్రారంభం

ప్రజల్లో వైసీపీ పట్ల తిరుగుబాటు ప్రారంభమైందని టీడీపీ కూటమి పెద్దాపరం అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళవారం జరిగిన టీడీపీలో చేరికలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు, నాయీబ్రాహ్మణ సంఘాలు చినరాజప్ప సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ చినరాజప్ప పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంకుశ వైసీపీ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దోచుకోవడమే ధ్యేయంగా జగన్ పాలన సాగించారని, చేతగాని పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి విజయం సాధించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపిం చాలని, కూటమి అభ్యర్థులను కూడా గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, ఎలిశెట్టి నాని, కర్రి వెంకటరమణ, మేడిది శ్రీనివాస్, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్, పెట్లు వీరభద్రరావు, ఏలేటి సుబ్బారావు పాల్గొన్నారు.

వైసీపీని తరిమేయండి : చిక్కాల

సామర్లకోట, ఏప్రిల్ 30: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ఓటుతో వైసీపీని తరిమేయాలని మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు పిలుపునిచ్చారు. సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచారానికి రామచంద్రరావు హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యేగా పెద్దాపురం నియోజకవర్గానికి విశేష సేవలందించిన టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పను, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్‌లను గెలిపించాలని ప్రజలను కోరారు. సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామన్నారు. చిక్కాల, రంగనాగ్‌లకు మహిళలు మంగళహారతులతో నీరాజనాలు పలికారు. ప్రచారంలో చీకట్ల వెంకటేష్, కుర్రా నారాయణస్వామి, ముమ్మిడి సూరిబాబు, అడ్డాల వెంకన్నబాబు, వింటి బాబ్జీ పాల్గొన్నారు.



సామర్లకోట: రావువారి చంద్రంపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చిక్కాల, రంగనాగ్

పవన్ కోసం ప్రచారం



కుమారపురంలో ప్రచారం నిర్వహిస్తున్న పద్మజ

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 30: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ మంగళవారం సాయంత్రం పిఠాపురం మండలం కుమారపురంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జనసేన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కూటమి నాయకులున్నారు.

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పలువురు బుల్లితెర నటులు పవన్‌కళ్యాణ్ మద్దతుగా మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. గాజు గ్లాసుపై ఓటు వేసి పవన్‌కి అఖండ విజయం చేకూర్చాలని వారు అభ్యర్థించారు.

పిఠాపురంలో పవన్ రాష్ట్రం గర్వపడే విధంగా భారీ మెజార్టీ సాధిస్తారని విజయనగరం జిల్లా రాజాంకు చెందిన యువకుడు శేఖర్ అన్నాడు. ఈనెల 16న రాజాం నుంచి పిఠాపురంలో పవన్ విజయం కోరుతూ పాదయాత్ర చేపట్టిన అశోక్ మంగళవారం కొత్తపల్లి చేరుకున్నాడు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు సూరంపేటలో పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన నాయకురాలు డీకే చైతన్య ఆదికేశవులు, టీవీ సీరియల్ నటులు మంగళవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుండ్ర సుబ్బారావు, మాదేపల్లి వినీల్‌వర్మ, పర్ల రాజా, మామిడాల సూరిబాబు, బస్వా చిట్టిబాబు, ప్రసాద్, బస్వా సత్యనారాయణ, కడారి బాబ్జి, గండే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ప్రచారంలో పాల్గొన్న సీరియల్ నటులు

వైసీపీతో అంటకాగుతున్నవారికే గాజుగ్లాసు గుర్తు

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు

జగ్గంపేట, ఏప్రిల్ 30: వైసీపీతో అంటకాగుతున్నవారికే గాజుగ్లాసు గుర్తు ఇచ్చారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ విలేకర్ల సమావేశం నిర్వహించగా తుమ్మలబాబు, ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు హాజరయ్యారు. తుమ్మల మాట్లాడుతూ జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్‌గా పనిచేసిన సూర్యచంద్ర పవన్ కల్యాణ్‌ని కాదని ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తూ గాజుగ్లాసు గుర్తు వచ్చిందని సంబర పడిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముంటే గాజుగ్లాసు గుర్తు కాకుండా వేరే గుర్తుపై పోటీ చేసి గెలిచి అప్పుడు తన సత్తా ఏంటో చూపించుకోవాలన్నారు. రాబోయే కూటమి ప్రభుత్వానికి భయపడి కుట్ర చేసి అన్యాయంగా జనసేనకు సంబంధించిన గాజుగ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడం చాలా దారుణమన్నారు. పవన్‌కల్యాణ్‌ను ఓడించలేకపోతే తమ పేరు ముద్రగడ పద్మనాభం రెడ్డి అని మార్చుకుంటానన్న దానికి తుమ్మల బాబు స్పందిస్తూ మతాలు మార్చుకోవడం అనేది భారతదేశంలో ఉంది కానీ కులాలు మార్చుకోవడానికి ఎక్కడా అవకాశం లేదన్నారు. కులాలు మారడం ఎలాగో ఆయనకే తెలియాలన్నారు. ముద్రగడ మాట్లాడుతుంటే చిన్న పిల్లల తత్వం కనిపిస్తుందన్నారు. జనసేన నాయకులు బుదిరెడ్డి శ్రీనివాస్, సూరంపాలెం బాలు, ఉలిసి అయిరాజు, రామకృష్ణ, పాలిశెట్టి సతీష్, దుర్గాప్రసాద్, నరేష్, భద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

జగ్గంపేట రూరల్: మండలంలోని నరేంద్రపట్నం గ్రామ వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వారికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కోరిమిల్లి నాగబాబు, కోరిమిల్లి మహేష్, కోసూరి వీరబాబు, పేనం శివ, సిరిబోలు కృష్ణ, సిరిబోలు చరణ్, ఇజ్జపు వెంకటేశ్వరరావు పార్టీలో చేరారు. బుదిరెడ్డి శ్రీనివాస్, సూరంపాలెం బాలు, మరిసే రామకృష్ణ, పాలిశెట్టి సతీష్, మాదారపు వీరబాబు, అయిరాజు పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదా కోసం నిలదీయాలి'

పెదాదపురం, ఏప్రిల్ 30: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఎన్నికల్లో పాలక పార్టీలను నిలదీయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, అరుణోదయా సాంస్కృతిక సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల ప్రజాజ్వామ్య విద్యార్థి సంఘం తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజాచైతన్య బస్సు యాత్ర మంగళవారం పెద్దాపురం చేరుకోగా మాట్లాడారు. అరుణోదయా కళాకారులు చేపట్టిన ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. వల్తూరి రాజబాబు, బి.రమేష్, నెలబాలుడు, మల్బూర్, అంజిబాబు, కడితి సతీష్, సురేష్ పాల్గొన్నారు.

సామర్లకోట: ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త జనచైతన్య యాత్ర బస్సు సామర్లకోటకు చేరుకుంది.

'అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం'

పిఠాపురం, ఏప్రిల్ 30: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో మంగళవారం మేదర సంఘం అధ్యక్షుడు పిల్లి నూకబాబు ఆధ్వర్యంలో యువత వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారి వర్మ టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారంతా ఓటు ద్వారా ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నేతలు కొండేపూడి ప్రకాష్, వియ్యపు రమణరాజు, అల్లవరపు నగేష్,పిల్లి బుజ్జి, అన్నవరం, సత్తిబాబు, తాతబ్బాయి ఉన్నారు.

'ఓటమి భయంతోనే దాడులు'

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 30: పుంగనూరులో ఓటమి ఖాయమని తేలిపోవడంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు బీసీవై అధినేత రామచంద్రయాదవ్‌పై భౌతిక దాడులకు దిగారని బీసీవై పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి తమన్నా సింహాద్రి విమర్శించారు. రాళ్లతో దాడి చేసి ప్రచారవాహనాలు, కాన్వాయ్‌లోని కార్లను తగులబెట్టడం దారుణమని రామచంద్రయాదవ్‌పై దాడిని ఖండించారు.

ఎన్నికల పరిశీలకుడు పర్యటన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30: ప్రత్తిపాడులో మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన జనరల్ అబ్జర్వర్ రాజేష్ జోక్‌పాల్(చండీఘర్) పర్యటించారు. ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు నిబంధనలకు లోబడి ఎన్నికల ప్రచారం సజావుగా నిర్వహించుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆర్వోకు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక ఆర్వో ఎ.శ్రీనివాసరావు, ఏఆర్వోలు రాజకుమారి, శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ, బీసీవై అభ్యర్థి గొంప శివ, లిబరేషన్ అభ్యర్థి ఏగుపాటి అర్జునరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ధర్నాల కోట శ్రీను, బెహరా లక్ష్మీప్రసన్న తదితరులున్నారు.

జగ్గంపేట: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎన్నికల పరిశీలకుడు రాజేష్ జోక్‌పాల్ అన్నారు. జగ్గంపేటలో అభ్యర్థులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

'వైసీపీ విషప్రచారాన్ని నమ్మవద్దు'

రౌతులపూడి, ఏప్రిల్ 30: పింఛన్ల విషయంలో వైసీపీ విషప్రచారాన్ని నమ్మవద్దని జనసేన పార్టీ రౌతులపూడి ఇన్‌చార్జ్ కరణం సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని చల్లూరూ, దబ్బాది, సార్లంకలో కాకికాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభను నెగ్గించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో నిర్జానాగు, ప్రకృతి సతీష్, సలీమ్, అర్జునరావు, గంగాధర్, నాగు, కుషరాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'రక్షిత మంచినీరందించాలి'

కరప, ఏప్రిల్ 30: ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటిని నిరాటంకంగా అందించాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తలరాతలు మార్చే ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి, ఏప్రిల్ 30: తొలి ఓటు ద్వారా తలరాతలు మార్చే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని నూతన ఓటర్లను ఉద్దేశించి జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం స్థానిక తోట గోపాలకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో కిర్లంపూడి టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు అధ్యక్షతన కిర్లంపూడి మండల నూతన ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్ తోట నవీన్ హాజరయ్యారు. నెహ్రూ మాట్లాడుతూ ఇవే తన చివరి ఎన్నికలని, రాబోయే ఐదేళ్లు నియోజకవర్గానికి ఏం కావాలో అడగండని ఆపని చేసి పెడతానన్నారు. రాబోయే రోజుల్లో 20వేల ఉద్యోగాలు, కార్పొరేట్‌స్థాయి హాస్పటల్ తీసుకొస్తానన్నారు. పలువురు నూతన ఓటర్లు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, తోట రవి, తోట గాంధీ, వీరంరెడ్డి కాశీబాబు, బస్వా వీరబాబు, కన్నబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, గుడాల రాంబాబు, ఆళ్ల శ్రీమన్నారాయణ, కాళ్ల వెంకటేష్, పాటంశెట్టి మురళీకృష్ణ, జంపన సీతారామచంద్ర వర్మ, గోడే బాల, సూరిశెట్టి వెంకటశివ, జ్యోతుల రాంబాబు, పట్టు చంటిబాబు, కంటా శ్రీను, గరగ గోవిందు పాల్గొన్నారు.



కిర్లంపూడి సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

తోట సునీత ఇంటింటా ప్రచారం

మండలంలోని జగపతినగరంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు గాజుగ్లాస్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తోట సర్వారాయుడు, కుర్ల చినబాబు, తూము కుమార్, ఆళ్ల నానాజీ, ఆళ్ల శ్రీమన్నారాయణ, గోడె బాల, కంద రాయుడు, సరిసే శివ, మల్ల రమేష్, ఆళ్ల దుర్గ ఉన్నారు.

టీడీపీలో చేరికలు

జగ్గంపేట: గోకవరం మండలం కృష్ణునిపాలెంలో జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో మాజీ ఎంపీటీసీ చింత విజయలక్ష్మి సుబ్రహ్మణ్యం తన అనుచరులతో టీడీపీలో చేరారు. ఇదే గ్రామంలో వైసీపీ నాయకుడిగా పేరొందిన బోలగుండ వెంకటేశ్వరరావు టీడీపీలో చేరారు. అలాగే వారితోపాటు యువ నాయకులు జడిమేను భరని, పొట్నూరి అచ్చారావు, చింతా వివేక్ చైతన్య, బంటుమిల్లి సురేష్, ఉరుం సీతయ్యతో 20 మది వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఆశిష్‌నెహ్రూ ఎన్నికల ప్రచారం

గండేపల్లి, ఏప్రిల్ 30: మండలంలో మురారిలో జగ్గంపేట టీడీపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోడలు లక్ష్మీదేవి, మనమడు ఆశిష్‌నెహ్రూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో జ్యోతుల నెహ్రూను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు జాస్తి వసంత్, గురజాల వెంకన్నదొర, సురేష్ పాల్గొన్నారు.



జగ్గంపేట: టీడీపీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న నెహ్రూ, కిర్లంపూడి: జగపతినగరంలో ప్రచారం నిర్వహిస్తున్న తోట సునీత, గండేపల్లి: మురారిలో ప్రచారం చేస్తున్న అశిష్ నెహ్రూ

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబును గెలిపించాలి : సత్యప్రభ



ప్రత్తిపాడు సమావేశంలో పాల్గొన్న సత్యప్రభ, టీడీపీలో చేరినవారికి ఆహ్వానిస్తున్న సత్యప్రభ, ఇంద్రనీల్ వర్మ ప్రచారం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30: రాష్ట్రాభివృద్ధికి యువత చంద్రబాబును మళ్లీ సీఎంగా గెలిపించాలని ప్రత్తిపాడు టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం సోషల్‌మీడియా,తెలుగు యువత కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, పరిశ్రమ స్థాపనకు రాష్ట్రంలో సంపద పెరుగుదలు చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం చారిత్రక అవసరమన్నారు. సమావేశంలో వెలుగుల నాని, కొండపల్లి శ్రీను పాల్గొన్నారు. అనంతరం ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి సత్యప్రభ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పోతులూరుకు చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలోచేరారు. చేరినవారిలో ముప్పిడి సత్యనారాయణ, అప్పారావు, సుబ్బారావు, వరదరాజు, చింతవీరుడు, డేవిడ్‌రాజు, చిన అప్పారావు, ఏలిబాబు ఉన్నారు. టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, దాట్ల కృష్ణబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చినశంకర్లపూడిలో టీడీపీ నాయకులు మిరియాల శ్రీను, కల్పన, దుర్గ ప్రచార ర్యాలీ నిర్వహించారు.

రౌతులపూడి: కూటమి అభ్యర్థులను గెలిపించాలని వరుపుల సత్యప్రభ బలరామపురం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో ప్రచారం నిర్వహిం చారు. పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ విషప్రచారాన్ని నమ్మవద్దని పిలుపునిచ్చారు. ఆమెకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైలపైడిరాజు, ఎంపీటీసీ సోమరౌతు రవి, కిల్లాడ వరహాలు, బుద్దాల శ్రీనివాస్, ప్రగడా మహేష్ పాల్గొన్నారు.

టీవీ నటుడు ఇంద్రనీల్ వర్మ ప్రచారం

ప్రత్తిపాడు: టీవీ నటుడు ఇంద్రనీల్ వర్మ ప్రత్తిపాడు దళితవాడలో స్థానిక టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ, కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ళ ఉదయశ్రీనివాస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు కొమ్మల కన్నబాబు, మూరా వరప్రసాద్, రావూరి తాతాజీ, జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఏలేశ్వరం: లింగంపర్తిలో వరుపుల సత్యమాధురి ఇంటింటికీ వెళ్లి కరప్రతాలు పంచారు. టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, వరుపుల దుర్గావేణి, సుబ్బరాజు, చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరుడు, పెంటకోట శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ



కరప: బూత్ ఏజెంట్లకు సూచనలిస్తున్న పంతం నానాజీ

కరప, ఏప్రిల్ 30: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉంటూ దొంగ ఓట్లను నిరోధించాలని కాకినాడ రూరల్ జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ సూచించారు. కరప మండలం పెనుగుదురు, ఉప్పలంక, గురజనాపల్లి, నడకుదురు, గొర్రిపూడి, పాతర్లగడ్డ, తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి బూత్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా, బూత్‌లో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. వైసీపీ నాయకులు అధికారయంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని దొంగ ఓట్లతో గెలవాలని కుయుక్తులు పన్నుతున్నారన్నారు. అనంతరం టీడీపీ, బీజేపీ కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరిగింది. టీడీపీ జిల్లా కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, కాకినాడ రూరల్ కో కోర్డినేటర్ కటకంశెట్టి బాబి, పార్టీ ఎలక్షన్ కన్వినర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు తదితరులు ఉన్నారు.

జనసేనలో చేరిక

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ తూరంగి శివారు పగడాలపేటకు చెందిన సుమారు 40 మంది వైసీపీ కార్యకర్తలు వలసపాకల గంగరాజునగర్ జనసేన కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి పంతం నానాజీ జనసేన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

'వైసీపీకి చరమగీతం పాడాలి'

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 30: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు వచ్చాయని, మే 13న ఎన్నికల్లో ఓటుతో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి అధికారం అప్పగించాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి కోరారు. జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పంతం నానాజీ కుమారుడు పంతం సందీప్, కూటమి నాయకులు రాందేవు సీతయ్యదొర, బొజ్జ భవాని, పలివెల గాయత్రి పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రావాలి

జనసేనాధిపతి పవన్ రావాలి...టీడీపీ-జనసేన,బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుతూ నాగార్జునసాగర్ నుంచి ఇచ్ఛాపురం వరకు పవన్ వీరాభిమాని బాలాజీ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం వలసపాకల రూరల్ జనసేన కార్యాలయం వద్దకు చేరింది. బాలాజీకి కాకినాడ రూరల్ అసెంబ్లీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, పార్టీ నాయకులు స్వాగతం పలికారు. గాజుగ్లాసు గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహనకల్పిస్తున్నట్టు బాలాజీ చెప్పారు.



సర్పవరం జంక్షన్: జనసేనలో చేరినవారితో నానాజీ



ప్రచారం నిర్వహిస్తున్న అనంతలక్ష్మి, పంతం సందీప్

భార్యతో ఘర్షణ పడి చెయ్యి కోసుకున్న భర్త

కరప, ఏప్రిల్ 30: భార్య కాపురానికి రావడంలేదనే అక్కసుతో భర్త తన చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు కరప పోలీసులు తెలిపారు. కరప మండలం వేములవాడకు చెందిన కరెడ్ల వీరవెంకటసుబ్రహ్మణ్యానికి మూడేళ్ల క్రితం వేళంగికి చెందిన వీరలక్ష్మితో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర పాప ఉంది. గ్రామ వలంటీర్‌గా పనిచేసి మానేసిన సుబ్రహ్మణ్యం ఏడాది క్రితం భార్యను వదిలేసి అల్లరి చిల్లరగా తిరుగుతున్నాడు. కాగా మంగళవారం అకస్మాత్తుగా వేళంగిలోని అత్తవారింటికి వెళ్లి కుమార్తెను తనకి ఇవ్వాలని భార్యతో ఘర్షణకు దిగాడు. వారు ప్రతిఘటించడంతో తో బ్లేడ్‌తో తన చెయ్యిని కోసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

తుని రూరల్, ఏప్రిల్ 30: తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో హంసవరం రైల్వేస్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ షేక్అబ్దుల్ మారుఫ్ తెలిపారు. మృతుడి వయస్సు 31 ఏళ్లు ఉంటాయని, వివరాలు తెలియపోవడంతో మృతదేహాన్ని సంబంధిత ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారన్నారు. సంబంధీకులెవరైనా ఉంటే తుని రైల్వే ఎస్ఐను సంప్రదించాలన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పద్మనాభం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 30: ఏపీ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కె.పద్మనాభాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడలో సంఘం కార్యాలయంలో ఏపీ రాష్ట ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఆఫీసు బేరర్ల ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కె.పద్మనాభం, ఉపాధ్యక్షులుగా జీఎస్.మూర్తి, ఎస్వీ నిత్యానందరావు, జి.గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా టి.నూకరాజు, కార్యదర్శిగా టి.ఆదినారాయణలను సర్వసభ్యుల సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పద్మనాభం తెలిపారు. నూతన పాలకవర్గ సభ్యులతో కలసి కలెక్టర్ నివాస్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా ఎన్నికైన ఆఫీస్ బేరర్ల జాబితాలను అందించారు.

'దుష్ప్రచారంపై ఫిర్యాదు చేస్తా'

పిఠాపురం, ఏప్రిల్ 30: సామాజిక మాధ్యమాల్లో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు మంగళవారం తెలిపారు. దొరబాబు ప్రధాని మోదీ సమక్షంలో బీజేపీలో చేరుతున్నారని సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగింది. దీనిపై దొరబాబు స్పందిస్తూ అవన్నీ తప్పుడు ప్రచారాలని ఖండించారు. తాను వైసీపీలోనే ఉంటానని చెప్పారు.